క్లుప్తంగా

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేసినవారికి ప్రశంసాపత్రాలను అందజేస్తున్న వక్తలు, బ్రహ్మకుమారీలు

హిరమండలం: రక్తదానం ప్రాణదానంతో సమానమని పలువురు వక్తలు అన్నారు. విశ్వ బంధుత్వ దినోత్సవం సందర్భంగా బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో హిరమండలంలో రక్తదాన శిబిరాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ ప్రతినిధులు రక్తాన్ని సేకరించారు. పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. హిరమండలం బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి బీకే మోహిని ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. చాపర నుంచి రాజయోగిణి బ్రహ్మకుమారి సుధారాణి, గ్రామపెద్దలు లాడి భాస్కరరావు, శ్రీధర్, చిన్నారావు, ఏవీ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్టీఓ మన్మథరావు

పాతపట్నం: స్థానిక ఉప ఖజానాధికారి (ఎస్టీఓ)గా పి.మన్మథరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన టెక్కలి ఉప ఖజానా (ట్రెజరీ)లో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేసి ఉద్యోగోన్నతిపై ఎస్టీఓగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఇంతవరకు ఇన్‌చార్జి ట్రెజరీగా సోంపేట ఎస్టీఓ ఎం.రమేష్‌నాయుడు పనిచేశారు. మన్మథరావును సబ్ ట్రెజరీ సిబ్బంది, పలువురు ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి కృషి



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరాలయం అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. వేంకటేశ్వర ఆలయానికి నూతన పాలక వర్గాన్ని ప్రభుత్వం ఇటీవల నియమించడంతో సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పాలకవర్గానికి పలు సూచనలు చేశారు. ఆలయ ఈఓ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

సత్యవరం విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

నరసన్నపేట: మండలంలోని సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గట్కా జిల్లా చాంపియన్‌షిప్–2025 పోటీల్లో సత్తా చాటారు. ఈ పోటీల్లో స్కూల్ నుంచి 23 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 10 మంది విద్యార్థులు బంగారు పతకాలు, 9 మంది వెండి పతకాలు పొందారు. ఈ పోటీలు జిల్లా గట్కా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగాయి. పతకాలు పొందిన విద్యార్థులకు హెచ్‌ఎం వకులాదేవి, పీఈటీ జ్యోతీరాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యవసాయ పరికరాల పంపిణీ



వ్యవసాయ పరికరాలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

బూర్జ: మండలంలోని పెద్దపేట హార్టీకల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో షెడ్యూల్ కులాల ఉపప్రణాళిక పథకం ద్వారా రైతులుకు వ్యవసాయ పరికరాలను ప్రిన్సిపాల్ సైంటిస్ట్ జి.నారాయణమూర్తి, సీనియర్ సైంటిస్ట్ టి.రాజశేఖరం ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. చిరుధాన్యాలు, గడ్డపార, గునపాం, స్ప్రేయర్లు, రైతులకు ఉపయోగపడే పరికరాలను అందజేశారు. ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు, హార్టీకల్చర్ ఏఓ హరినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నీట్‌లో ప్రతిభ



పేడాడ భరద్వాజ్



జరుగుళ్ల హాసిని

ఆమదాలవలస: పట్టణంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన పేడాడ భరద్వాజ్ నీట్ ప్రవేశ పరీక్షలో సత్తాచాటి వైద్య విద్యకు ఎంపికయ్యాడు. ఆదివారం విడుదలైన సీట్ల కేటాయింపులో భరద్వాజ్‌కు విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని మిమ్స్ కళాశాలలో ఫ్రీ సీటు లభించినట్లు విద్యార్థి తండ్రి వెంకటరమణ సోమవారం తెలిపారు. తండ్రి రైతు, తల్లి గృహిణి. అలాగే మండలంలోని జీకేవలస గ్రామానికి చెందిన జరుగుళ్ల హాసిని నీట్‌లో ప్రతిభ కనబరిచి విజయవాడ ఎస్ఆర్ఐ మెడికల్ కళాశాలలో ఫ్రీ సీటు పొందింది. తండ్రి నాగభూషణరావు పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నారు. తల్లి గృహిణి. వీరికి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

ఆదమరిస్తే అంతే..!



ఆమదాలవలస మండలం చెవ్వాకుల పేట వద్ద పాడైన కాలువ రక్షణ గోడలు



సవలాపురం జంక్షన్ వద్ద శిథిలమైన బ్రిడ్జి



పురుషోత్తపురం సమీపంలో కూలిన రక్షణ గోడ

- బ్రిడ్జీలు, కల్వర్టుల మనుగడ ప్రశ్నార్థకం
- పలుచోట్ల శిథిలమైన రక్షణ గోడలు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

సరుబుజ్జిలి: రహదారుల్లోని వంతెనలు, కల్వర్టులు పలుచోట్ల శిథిలావస్థకు చేరుకోవడంతో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఆర్‌అండ్‌బీ రహదారుల్లోని బ్రిడ్జిలు ఏర్పాటు చేసిన చాలా చోట్ల రక్షణ గోడలు లేక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రయాణికులకు నిత్యం ఇబ్బందులు తప్పడంలేదు.

62 చోట్ల శిథిలం..

ఆమదాలవలస నియోజకవర్గంలోని ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు మండలాల్లో దాదాపు 177 కిలో మీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రహదారులు విస్తరించి ఉన్నాయి. సుమారు 120 బ్రిడ్జిలు ఉన్నాయి. వీటిలో దాదాపు 62 చోట్ల పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇక్కడికి వచ్చేసరికి వాహనదారులు భయంతో వణుకుతున్నారు.

రక్షణ గోడలు లేక ప్రమాదాలు..

రహదారి బ్రిడ్జిలకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మిస్తారు. ఇవి ప్రమాదాలు జరిగే సమయంలో వాహనాలు బ్రిడ్జి పైనుంచి కిందకు పడకుండా అడ్డుకుంటాయి. సరుబుజ్జిలి మండలంలోని ఎ.ఎల్.నగరం, సవలాపురం జంక్షన్, కొత్తకోట తదితర ప్రాంతాల్లో ఉన్న వంతెనలకు సంబంధించిన రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పలుమార్లు ఆయా ప్రదేశాల్లో వాహనాలు ఓవర్ టేక్ చేసే సమయంలో అదుపుతప్పి గోడలకు ఢీకొట్టిన సందర్భాలు అనేకం ఉన్నాయి. రొట్టవలస నుంచి ఆమదాలవలస వరకు గల ఆర్‌అండ్‌బీ రహదారిలో యరగాం ఛానల్‌పై రెండు చోట్ల ఉన్న బ్రిడ్జి రక్షణ గోడలు పూర్తిగా పాడయ్యాయి. ఇరువైపులా గోడలు లేకపోవడం వలన రాత్రి వేళల్లో కొత్తగా ప్రయాణించేవారు ప్రమాదాల బారినపడుతున్నారు. బరువుల విషయంలో నియంత్రణ లేకపోవడం వలన.. వాహనదారులు ఇష్టారాజ్యంగా ప్రయాణాలు చేయడంతో బ్రిడ్జిలు దెబ్బతింటున్నాయి. ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జిల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే కొంతవరకు ప్రమాదాలను అరికట్టవచ్చు.

ఆమదాలవలస నియోజకవర్గంలోని బ్రిడ్జిల వివరాలు ఇలా..				
మండలం	సరుబుజ్జిలి	ఆమదాలవలస	బూర్జ	పొందూరు
బ్రిడ్జీలు	26	34	28	32
పాడైనవి	15	18	13	16

ఉన్నతాధికారులకు నివేదించాం

రహదారుల్లో బ్రిడ్జిలు, కల్వర్టుల రక్షణ గోడలు పలుచోట్ల శిథిలమయ్యాయి. వాటికి సంబంధించిన వివరాలు ఉన్నతాధికారులకు నివేదించాం. ఆదేశాలు వచ్చిన వెంటనే తదుపరి చర్యలు చేపడతాం.

– ఆంజనేయ నాయక్, ఆర్‌అండ్‌బీ జేఈ, సరుబుజ్జిలి

నిర్వహణ సక్రమంగా చేయాలి



మండలంలోని రహదారుల్లో ప్రయాణాలు చేయడానికి భయమేస్తోంది. బ్రిడ్జీలు, రక్షణ గోడలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వాహనాలు ఏమాత్రం పక్కకు వెళ్లినా ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే రక్షణ గోడలు నిర్మించాలి. ఏళ్ల తరబడి బ్రిడ్జీలు, గోడల నిర్వహణ విషయంలో అధికారులు పట్టించుకోవడం లేదు.

– గదిలి రమణమూర్తి, తురకపేట, సరుబుజ్జిలి మండలం

బరువు నియంత్రించాలి



పాడైన బ్రిడ్జిలపై ఊక, గడ్డి, కలప వాహనాలు తరచూ ప్రయాణాలు చేస్తున్నాయి. పరిమితికి మించిన బరువులతో ప్రయాణం చేయడం వలన బ్రిడ్జిలు ఉనికికే ప్రమాదముంది. పాత బ్రిడ్జిల వద్ద ఒకేసారి బరువైన వాహనాలు వచ్చేటప్పుడు నియంత్రించాలి.

– బెండి పూర్ణారావు, సరుబుజ్జిలి

వినాయక మండపాలు ముస్తాబు



పాలపోలమ్మ తల్లి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మండపం



తొగరాంలో విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న శ్రావణ్‌కుమార్, తదితరులు

ఆమదాలవలస: పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేందుకు మండపాలను వాడవాడలా ముస్తాబు చేస్తున్నారు. పాలపోలమ్మ తల్లి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న భారీ మండపం చూపరులను ఆకట్టుకుంటోంది. మండంలోని చీమవలసలో అమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో 20 వేల మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. ఆలయ ధర్మకర్త శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, శ్రీకాకుళంతోపాటు పలు మండలాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వినాయక విగ్రహాలు పంపిణీ చేశామన్నారు. పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషి చేస్తున్నామన్నారు. మండలంలోని తొగరాం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం వినాయక విగ్రహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు సనపల కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బూర్జ: మండలంలోని నాగావళి నదీ తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వై.వి.పద్మావతి అన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి వర్షం కురుస్తున్నందున వరదలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. లోతట్టు గ్రామాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. గ్రామాల్లో దండోరా వేయించాలని వీఆర్వోలకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. నది సమీపంలోకి ప్రజలు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశామన్నారు. నిత్యావసర సరుకులు కూడా సమకూర్చుకోవాలన్నారు.

ప్రయాణం సురక్షితమేనా.?



పొందూరు-రాజాం ప్రధాన రహదారి పక్కనే ఒరిగిన స్కూల్ పిల్లల ఆటో (ఫైల్)

- పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్న ఆటోలు, వాహనాలు
- పట్టించుకోని తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

పొందూరు: ప్రమాదాల మాటున విద్యార్థులు ప్రయాణం చేస్తున్నారు. విద్యార్థులు ఆటోలో స్కూళ్లకు తీసుకెళ్తున్న సందర్భంగా భద్రత, చట్టపరమైన నియమాలు, డ్రైవర్ల బాధ్యతల గురించి స్పష్టమైన మార్గదర్శకాలున్నాయి. అవి అమలవుతున్నాయా, లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆటోలో ఎటువంటి ఏర్పాట్లు ఉన్నాయో చూసేందుకు అధికారులు, తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలకు పట్టకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

చట్టపరమైన నియమాలు ఇలా...

మోటార్ వెహికల్ చట్టం ప్రకారం ఒక ఆటోలో రవాణా సాధారణంగా ఆరు నుంచి ఏడుగురు చిన్నారులకు మించకూడదు. డ్రైవర్‌కు లైసెన్సు ఉండాలి. వాహనానికి స్కూల్ వెహికల్ అనుమతి ఉండాలి. ఆటోకు 'స్కూల్ చిల్డ్రన్' బోర్డు ముందు, వెనుక భాగంలో స్పష్టంగా ఉండాలి. స్కూల్ పిల్లల ఆటోలను పోలీసులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి.

భద్రతా ఏర్పాట్లు తప్పనిసరి..

ఆటోలో కూర్చున్న పిల్లలు బయటకు వంగిపోకుండా ఉండేందుకు గ్రిల్స్, రక్షణ గేట్లు ఉండాలి. వాహనం సీట్లు సురక్షితంగా ఉండాలి. పదునైన అంచులు లేకుండా ఆటోను సర్దుబాటు చేసుకోవాలి. ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తప్పనిసరిగా ఉండాలి. పిల్లలను సురక్షితంగా ఎక్కించడం, దింపడం డ్రైవర్ బాధ్యతగా వ్యవహరించాలి. తల్లిదండ్రుల అనుమతి లేకుండా రోజూ ప్రయాణించే మార్గాన్ని మార్చకూడదు. తల్లిదండ్రులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలి.

చూసుకోవాలిలా...

విద్యార్థులను వాహనంలో ఎక్కించేటప్పుడు డ్రైవర్ వివరాలు కచ్చితంగా తెలుసుకోవాలి. పిల్లలు సమయానికి ఎక్కినట్లు, సురక్షితంగా చేరుకున్నట్లు నిర్ధారించుకోవాలి. అప్పుడప్పుడు స్కూల్ యాజమాన్యంతో వాహనాల వివరాలను అడిగి తెలుసుకుంటూ ఉండాలి. ఒకవేళ సమయంలో మార్పు వస్తే కచ్చితంగా వాహనంలోకి తమ పిల్లలను ఎక్కించే ముందు పాఠశాల యాజమాన్యానికి ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవాలి. సురక్షితంగా పాఠశాలకు చేరేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

వాహనాలు తనిఖీ చేస్తున్నాం

నిరంతం వాహనాలను తనిఖీ చేస్తున్నాం. ఓవర్ లోడ్‌తో ఉన్న ఆటోలపై కేసులు నమోదు చేస్తున్నాం. స్కూల్ పిల్లలను ఎక్కువ మందిని ఆటోలో ఎక్కించినా, ప్రయాణికులను ఎక్కించినా కేసులు నమోదు చేసి సీజ్ చేస్తాం. ఆటోల్లో ఎక్కువ మంది పిల్లలను ఎక్కించకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి.

– వి.సత్యనారాయణ, ఎస్ఐ, పొందూరు

13న జాతీయ లోక్ అదాలత్

నరసన్నపేట: స్థానిక కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని, దీంట్లో వీలున్నంత వరకు ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసు అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. క్రిమినల్, సివిల్ కేసులు ఎక్కువగా పరిష్కారం కావాలన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. సులువుగా కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ మంచి మార్గమన్నారు. ఈ సమీక్షలో నరసన్నపేట, పోలాకి పోలీస్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వ్యాపారులతో కూటమి నాయకుల కుమ్మక్కు



మూడడ్ల రమణ

సరుబుజ్జిలి: ప్రైవేట్ వ్యాపారుల దుకాణాల వద్ద అధికారులు కూర్చొని ఎరువులు విక్రయించడం ఎంత వరకు సమంజసమని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ ప్రశ్నించారు. రైతు సేవా కేంద్రాల వద్ద పంపిణీ చేయాల్సిన ఎరువులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద నిల్వ చేయడంతో పలు అనుమానులు కలుగుతున్నాయన్నారు. వ్యాపారులతో కూటమి నేతలు, కుమ్మక్కయ్యారని, దీంతో రైతులకు ఎరువులు అందడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. ప్రైవేట్ వ్యాపారుల వద్ద సరకులు నిల్వ చేయడం వలన వారు అధిక ధరలకు విక్రయిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం నిర్మించిన రైతు సేవా కేంద్రాలను విడిచిపెట్టి ప్రైవేట్ దుకాణాలు వద్ద ఎరువులు విక్రయిండం అధికారుల వైఫల్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. తక్షణమే జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రైలు ఢీకొని మూడు గొర్రెల మృతి



మృతి చెందిన, గాయాలు పాలైన గొర్రెలు

పాతపట్నం: పాతపట్నం రైల్వేస్టేషన్ సమీపంలోని ఎస్టీ బాలుర వసతి గృహం సమీపంలో రైలు పట్టాల వద్ద సోమవారం మధ్యాహ్నం రాజారాణి ఎక్స్‌ప్రెస్ ఢీకొని మూడు గొర్రెలు మృతి చెందాయి. మరో మూడు గొర్రెలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరసవాడ గ్రామానికి చెందిన పైశెక్కి నీలకంఠం, పైశెక్కి లక్ష్మీనారాయణ, ఈగల అప్పలస్వామిలకు చెందిన గొర్రెల మందలు పాతపట్నం రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రహరాజపాలెం ఎస్టీ బాలుర వసతి గృహం వద్ద రైలు పట్టాల పక్కన మేత వేస్తున్నాయి. ఆ సమయంలో గుణుపూర్ నుంచి వస్తున్న రాజరాణి ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో మూడు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో మూడు గొర్రెలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే గొర్రెల కాపలాదారులు ఆటోలో మూడు గొర్రెలను కొరసవాడ పశువుల ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. మూడు గొర్రెలు విలువ రూ.20 వేలు ఉంటుందని పెంపకందారులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు దారుణం



- వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి

హిరమండలం: దివ్యాంగుల పింఛన్లను కూటమి ప్రభుత్వం అన్యాయంగా తొలగిస్తోందని వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. లేనిపోని నిబంధనలతో పెద్ద ఎత్తున పింఛన్లను తొలగించడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్లు తొలగిస్తుండడంతో మనస్తాపంతో చాలామంది దివ్యాంగులు తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. అటువంటి వారి ఉసురు కూటమి ప్రభుత్వానికి తగులుతుందన్నారు. తక్షణమే తొలగించిన పింఛన్లను పునరుద్ధరించకపోతే వైఎస్సార్‌సీపీ తరఫున ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విషయంలో సీఎం చంద్రబాబు అనుసరిస్తున్న తీరు సరికాదన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుచరుల ఆగడాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయన్నారు. ఒక్క ఏడాదిలోనే ఎమ్మెల్యేపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, వచ్చే ఎన్నికల్లో ప్రజాగ్రహానికి కొట్టుకుపోవడం ఖాయమన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించారని గుర్తు చేశారు. దివ్యాంగులకు పింఛన్లు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. రాజకీయాలకు అతీతంగా పింఛన్లు అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు.

జంగిల్ క్లియరెన్స్ చేయాలి



పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న చింతాడ రవికుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలోని పలు రహదారుల పక్కన ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజవకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ కోరారు. శ్రీకాకుళం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో ప్రధానంగా బొడ్డేపల్లిపేట జంక్షన్ నుంచి రాగోలు జంక్షన్, కొత్తవలస నుంచి లాభం, నారాయణపురం నుంచి పి.ఎల్.దేవిపేట జంక్షన్ వరకు రోడ్డు పక్కన ఉన్న జంగిల్‌ను తొలగించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తోలాపి నుంచి పెనుబర్తి, కింతలి నుంచి గోకర్ణపల్లి, పొందూరు నుంచి గోకర్ణపల్లి, పొందూరు నుంచి జాడపేట, పిల్లలవలస జంక్షన్ నుంచి ట్రిపుల్ ఐటీ జంక్షన్, లోలుగు జంక్షన్ నుంచి బాణాం, ఆమదాలవలస రైల్వే గేటు జంక్షన్ నుంచి పురుషోత్తపురం, సవలాపురం జంక్షన్ నుంచి యరగాం, సరుబుజ్జిలి జంక్షన్ నుంచి పాతపాడు వరకు గల ప్రధాన రహదారుల్లో ఇరువైలా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని కోరారు.

పలు కుటుంబాలకు పరామర్శ



వంజంగిలో పూజారి చక్రపాణి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



కృష్ణాపురంలో వైకుంఠమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన కూన వైకుంఠమ్మ, మండలంలోని వంజంగి గ్రామానికి చెందిన పూజారి సత్యవతి ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు తమ్మినేని సీతారాం సోమవారం పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు కె.సురేష్, పైడి హరనాథరావు, మున్సిపల్ మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ ఎ.ఉమామహేశ్వరరావు, రామకృష్ణ, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

పరామర్శ..

ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి కృష్ణాపురం గ్రామానికి చెందిన కూన వైకుంఠమ్మ, బొడ్డేపల్లి విజయలక్ష్మి అనారోగ్యంలో ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పరామర్శించారు. పార్టీ జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, నాయకులు కూన రామకృష్ణ, అన్నెపు కృష్ణ, గురుగుబెల్లి రమేష్, తిరుపతిరావు, ప్రసాద్, కార్యకర్తలు ఉన్నారు.

చినుకుపడితే చిత్తడే



సరుబుజ్జిలి సమీపంలో రహదారి దుస్థితి..

సరుబుజ్జిలి: చిన్న వర్షం కురిసినా రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతోపాటు సోమవారం కురిసిన వర్షానికి గోతుల్లో నీరు చేరింది. వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఎక్కడ గొయ్యి ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో రహదారుల మరమ్మతులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. దీంతో నరకయాతన పడుతున్నామని, రహదారులను బాగుచేయాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



ఆమదాలవలస రైల్వే క్వార్టర్స్ సమీపంలో రహదారిపై నిల్వ ఉన్న వర్షం నీరు

సంక్షిప్తంగా..

దాతల సహకారంతోనే అభివృద్ధి

జలుమూరు: దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని జలుమూరు ప్రాథమిక మోడల్ పాఠశాల హెచ్‌ఎం ఇప్పిలి మాధవరావు అన్నారు. సోమవారం ఇదే గ్రామానికి చెందిన పాలవెల్లి శరత్‌బాబు, కామిరెడ్డి శ్రీనివాసరావుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సుమారు రూ.25 వేల విలువ చేసే రౌండ్ స్వింగ్ ఉయ్యాలను పాఠశాలకు అందించారు.

మెగా ఫోన్ వితరణ

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రముఖ న్యాయవాది, కార్మిక నాయకుడు చాపర రమేష్ కుమార్తె దంత వైద్యురాలు అనూష సోమవారం మెగా ఫోన్‌ను అందించారు. ప్రార్థన సమయంలో ఉపయోగించే మెగా ఫోన్‌ను అందించడంతో ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఎడ్యుకేషన్ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు శిక్షణ

మెళియాపుట్టి: ఆదికర్మయోగి కార్యక్రమం ద్వారా గిరిజనుల సమస్యలు పరిష్కారం కావాలని పలువురు అధికారులు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలంలో ఎంపీడీఓ ఎస్.పి.పండా అధ్యక్షతన సచివాలయం, ఇతర శాఖల ఉద్యోగులకు ఆదికర్మ యోగి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనలకు శిక్షణ ఇచ్చి, వారి స్థితిగతుల మెరుగుకు కృషి చేస్తోందని, అందులో భాగంగానే మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ తీసుకుని మండల, గ్రామ స్థాయిలో శిక్షణ ఇవ్వాలన్నారు. గిరిజన ప్రాంతాల సంక్షేమం, అభివృద్ధి, విద్య, వైద్యం, జీవనోపాధి వంటి వాటిలో అభివృద్ధి సాధిలంచాలన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

మెళియాపుట్టి: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని కొత్తూరు వెలుగు అసోసియేషన్ సభ్యులు అన్నారు. మండలంలోని మూలనేలబొంతు గిరిజన గ్రామంలో హక్కులు, చట్టాలపై సోమవారం అవగాహన కల్పించారు. అటవీ హక్కులు గిరిజనులకు ఏవిధంగా వర్తిస్తాయో తెలిపారు. పోడు పట్టాలు పొందడం, రికార్డ్స్ ఆఫ్ రైట్స్ ఉపయోగాలను తెలియజేశారు. పలు హక్కుల కోసం దరఖాస్తులు ఎలా చేసుకోవాలో వివరించారు. రిసోర్స్ పర్సన్లు చిరంజీవి, నాగరాజు, రంగారావు, సమన్వయకర్త జగన్, మొబలైజర్లు పాల్గొన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

సారవకోట: మండలంలోని సత్రాం గ్రామంలో సోమవారంతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ముగిశాయి. స్థానిక త్రైత సిద్ధాంత భగవద్గీత సభ్యుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవానుడి విగ్రహానికి సత్రాం, గొల్లపేట గ్రామాల్లో తిరువీధి చేట్టారు. ఆయా గ్రామాల ప్రజలు, నిర్వాహకులు పాల్గొన్నారు.